# మాట నిలకడ



*శ్యామాయా శ్యామలితః*
*అర్థాక్షి ప్రలోకన ముఖశోభో*
*జంబూ దళ కృత కర్ణా*
*వతంసే భ్రమతి హాలిక పుత్రే*

**భావం:** నేరేడు ఆకునే చెవికి ఆభరణంగా ధరించి తిరుగుతున్న రైతుబిడ్డను క్రీగంటి చూపులతో చూసిన శ్యామ ముఖం శోభను కోల్పోయి నల్లబడింది.

ఒకానొక గ్రామంలో భూస్వామి కూతురు పేరు శ్యామ. ఒకనాడు ఆమె తండ్రికి భోజనం తీసుకుని పొలానికి వెళ్ళింది. తండ్రి తనతో

మాట్లాడుతున్న యువకుణ్ణి చూపించి 'ఇతను మన పక్క పొలం రైతుకి అన్న కొడుకుపేరు నీలాద్రి. ఈ మధ్యనే ఈ ఊరు వచ్చాడు. పినతండ్రికి పొలం పనులలో సాయం చేస్తుంటాడు." అన్నాడు. శ్యామ నీలాద్రిని చూసింది. అతని అందం ఆమెకు నచ్చింది. గారాబంగా పెరిగిన శ్యామకు తను కోరుకున్నది వెంటనే సాధించుకోవడం అలవాటు. తనకు అతను నచ్చాడు. కాబట్టి అతనికి తను నచ్చే తీరాలని ఆమె అనుకుంది. తండ్రి భోజనం చేస్తుండగా అతనితో రహస్యంగా 'సాయంత్రం ఊరిబయట గుడి వెనుక ఉన్న నేరేడు చెట్టు దగ్గర కలుసుకుందాం రా' అంది. నీలాద్రి సరేనన్నాడు.

తండ్రి భోజనమయ్యేక శ్యామ ఇంటికి వెళ్ళింది. అప్పటికి ఆమె పిన్ని కుటుంబం వేరే ఊరినుంచి వచ్చి ఉంది. వారితో మాటలలో పడ్డ శ్యామ సాయంత్రం నేరేడు చెట్టు దగ్గరకు వెళ్ళాలన్న విషయం మర్చిపోయింది.

నీలాద్రి సాయంత్రం నేరేడు చెట్టు దగ్గర శ్యామకై ఎదురు చూశాడు. ఆమె ఎప్పటికీ రాలేదు. ఆమె ఇంటికి వెళ్ళి ఎందుకు రాలేదని అడిగితే ఇద్దరి పరువూ పోతుంది. ఆమెను ఇంట్లో వాళ్ళు శిక్షిస్తారేమో.

మర్నాడు శ్యామ తన పిన్ని కూతుళ్ళను ఊరిలోని విశేషాలను చూపించడానికి తీసుకెళ్ళింది. తాము ఎటు వెళ్ళినా ఒక వ్యక్తి కన్పిస్తుండడం ఆ పిల్లలు గమనించారు.

'శ్యామక్కా ఎవరా పిచ్చివాడు? నేరేడు ఆకునే చెవి కమ్మలుగా పెట్టుకుని ఊరంతా తిరుగుతున్నాడు?" అని అడిగారు.

శ్యామ తలెత్తి చూసింది. నీలాద్రి చెవులకు నేరేడు ఆకులున్నాయి. నిన్న సాయంత్రం నేరేడు చెట్టు దగ్గర కల్సుకుందామని చెప్పి తను వెళ్ళడం మర్చిపోయింది. నేరుగా వచ్చి ఎందుకు రాలేదని నిలదియ్యని అతని మంచితనం ఆమె కళ్ళల్లో నీళ్లు తెప్పించింది. సిగ్గుతో ఆమె తల వంచుకుని క్రీగంట అతన్ని చూసిన ఆమె ముఖం చేసిన తప్పుకు బాధా సూచకంగా నల్లబడింది.

శ్యామ పాత కాలం పిల్ల నేటి ఆధునిక యువతులైతే తిరగబడి "ఒక్కసారి రానంత మాత్రాన అంతగా నేరేడు ఆకు చెవిలో పెట్టుకుని వెక్కిరించాలా? నాకు వేరే పనులుండవా. ఉండకూడదా? నువ్వు రాకపోతే నేనిలా యాగీ చేస్తానా?" అని కయ్యానికి కాలు దువ్వి ఉందురేమో.

******